


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY



సంపుటి 11 | సంచిక 59 | కర్నూలు | మంగళవారం 07-04-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi


# నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

భూమిలో నీరు ఇంకితేనే సేద్యానికి సాధ్యం

నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి

నీటి భద్రతలో రైతులు భాగస్వామ్యం కావాలి

గతంలో ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు చేపట్టాం


మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తున్నాం

'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత'లో సిఎం చంద్రబాబు

మావిగన్ పేరుతో అమరావతిని అడ్డుకునే కుట్రలు అంటూ విమర్శలు




అనంతపురం,ఏప్రిల్ 6(శ్రీచక్ర) : బ్యాంక్‌లో నగదు దాచుకున్నట్లు మనం నీటిని భూమిలో దాచుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో చంద్రబాబు పర్యటించారు. 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు. వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసని అన్నారు. నీటిని సంరక్షించుకోవడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి.. నిలబడిన నీటిని నిల్వ చేయాలి.. జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాలన్నారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం వంటివి గతంలో చేపట్టామని చంద్రబాబు వివరించారు. నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాల్లో వేశామని ఏపీ సీఎం గుర్తు చేశారు. నీటి భద్రతా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రైతులు, సాగునీటి సంఘాలకు సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో తాము చేసింది.. దేశం మొత్తం అనుసరించిం దని అన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తూ దేశంలో నంబర్ వన్‌గా ఉన్నామన్నారు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు-మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే.. ప్రస్తుతం అవి 11 మీటర్లే ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతు, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా నీరు చూడాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అలా చేయగలిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు నీరు అవసరమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమలకు 28, తాగు నీటికి 158 టీఎంసీల చొప్పున మొత్తంగా 1,300 టీఎంసీల వరకూ మనకు అవసరం అవుతాయని వివరించారు. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకు వచ్చామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని.. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అని పేర్కొన్నారు.మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి అని సీఎం స్పష్టం చేశారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు రాజధాని అమరావతికి మద్దతు పలికాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఒక్క దిక్కు మాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి ముదిరి మావిగన్ అనే పేరు తెరపైకి తెచ్చారని వైసీపీ అధినేతపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారని సీఎం చంద్రబాబు వ్యంగ్యంగా అన్నారు. బాబాయిని చంపి తన చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారంటూ వైసీపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎండగట్టారు. రాజధాని అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. అవి చూసి సహించలేకే ఈ విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని వైసీపీ నేతల తీరుపై ఏపీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జలధారతో ప్రతి ఎకరానికీ జలహారతి ఇచ్చేలా కార్యాచరణ చేపడదామని ప్రజలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.




## రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

పరిశీలన అనంతరం సంతకం చేసే అవకాశం

న్యూఢిల్లీ,ఏప్రిల్6(శ్రీచక్ర) : రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు-2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుమారు ఐదు గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. ఇవాళ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.



## బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఊరూవాడా జెండా ఎగరేసిన పార్టీ శ్రేణులు

రాష్ట్ర కార్యాలయ వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు పివిఎన్ మాధవ్


పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు

విజయవాడ,ఏప్రిల్6 (శ్రీచక్ర) ఏపీ వ్యాప్తంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా పార్టీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగురవేసి ... నాయకులు, కార్యకర్తలకు స్వీట్‌లు తినిపించారు మాధవ్. నేటి నుంచి గ్రామపంచాయతీల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు.. మన జెండా' పేరుతో కార్యక్రమం ప్రారంభంకానుంది. దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేసిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టిందన్నారు. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి నుంచి సంపూర్ణ మద్దతుగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు బీజేపీ బలపడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనకడుగు వేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.ఇదిలావుంటే బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసిందని సీఎం చంద్రబాబు పోస్టు చేశారు. భారతీయ జనతా పార్టీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న ఈ పార్టీ.. మన సంస్కృతిని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ, సమగ్ర అభివృద్ధి, దేశ సేవ కోసం నిరంతరం కృషి చేస్తోంది. పార్టీ వ్యవస్థాపక నేతల నుంచి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ తన నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న వేగంతో పనిచేస్తోన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ ప్రజలకు సేవలు అందిస్తూ, సహాకార పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వ ంలో.. దేశ సేవలో బీజేపీ మరిన్ని విజయాలు సాధించాలని, 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా మన ప్రయాణాన్ని మరింత బలోపేతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

ఆనాటి నేతలు...నేటి మోడీతో మరింత బలోపేతం

47వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్



అమరావతి,ఏప్రిల్ 6(శ్రీచక్ర) బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలో అడుగిడుతున్న శుభ తరుణాన ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం పట్ల ప్రేమ, దేశ ప్రజల పట్ల అంకితభావం అనే సిద్ధాంతాలే ఆలంబనగా బీజేపీ ముందుకు వెళ్తోందన్నారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ లాంటి మహనీయుల సంకల్పం.. ప్రధాని మోదీ అచంచల విశ్వాసంతో కూడిన పోరాటంతో నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ కీర్తిని ఆర్జించిందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం క్లిష్ట పరిస్థితుల్లో కూడా సమర్థవంతమైన విధానాలు అమలు చేస్తూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిందన్నారు. భారతీయ జనతా పార్టీ వికసిత్ సంకల్పం దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టాం

గత ప్రభుత్వంలో 20శాతం పనులు మాత్రమే చేశారు

ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయ్యాయి

పోర్టు పనులను పరిశీలించిన మంత్రులు జనార్ధన్, అచ్చన్న



శ్రీకాకుళం,ఏప్రిల్ 6 : శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష మూలపేట పోర్టు అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టామని.. 1,524 ఎకరాల్లో 4 బెర్తుల నిర్మాణం చేప డుతున్నట్లు చెప్పారు. మూలపేట పోర్టును ఈ నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూలపేట పోర్టును మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పరిశీలిం చామని.. ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో 20 శాతం పనులు మాత్రమే చేశారని.. ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 20 నెలల్లోనే 49.63 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. కరపత్రిక అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. పోర్టు కోసం కావల్సిన ఉప్పు భూముల విషయంలో వైసీపీ చిత్తశుద్ధితో పని చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఉప్పు భూముల కోసం కేంద్రంతో సంప్రదింపులు చేశామని.. 385 ఎకరాల ఉప్పు భూములను లీజ్‌పై కేంద్ర కేటాయించిందని వివరిం చారు. వైసీపీ నేతలు 20 నెలల తరువాత రాజకీయం చేస్తున్నారని.. ఈ 20 నెలలు నిద్ర పోయారా అంటూ మంత్రి ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసమే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ప్రజలు అందుకే బుద్ధి చెప్పారన్నారు. రాజధాని అని చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడుదాం రండి అంటూ జగన్, వైసీపీ నేతలకు మంత్రి ఛాలెంజ్ విసిరారు. గతంలో అమరావతికి ఓకే అన్న జగన్.. మోసం చేసి తరువాత మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. జగన్ అభివృద్ధి చేసే నాయ కుడు కాదని.. విధ్వంసం సృష్టించే నాయకుడంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే 11సీట్లకి పరిమిత మయ్యారన్నారు. దేశంలో ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్‌లలో భోగాపురం నంబర్ 2గా నిలవనుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.

## ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం

సెక్యూరిటీని ఛేదించుకుని దూసుకు వచ్చిన కారు

కారును స్వాధీనం చేసుకుని, డ్రైవర్ అరెస్ట్

న్యూఢిల్లీ,ఏప్రిల్ 6(శ్రీచక్ర) : ఢిల్లీ అసెంబ్లీ వద్ద సోమవారంనాడు కీలకమైన భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. సెక్యూరిటీని ఛేదించుకుని ఓ కారు దూసుకు వచ్చింది. ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఒక వాహనం బలవంతంగా అసెంబ్లీ ఆవరణలోకి అడుగుపెట్టినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటన సంచలనం సృష్టించగా, ఢిల్లీ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, గేట్ నెంబర్ 2 వద్దనున్న ఇనుప బ్యారియన్‌ను ఛేదించుకుంటూ ఒక వాహనం అసెంబ్లీ ఆవరణలోకి అడుగుపెట్టింది. వాహనం డ్రైవరు స్పీకర్ విజేందర్ గుప్తా కార్యాలయం వైపు దూసుకుపోయాడు. కార్యాలయం ముందు ఫ్లవర్ బోకే ఉంచడంతో పాటు స్పీకర్ కారుపై ఇంకు చల్లినట్టు గుర్తించారు. ఘటన అనంతరం వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. హైసెక్యూరిటీ జోన్‌లో ఈ ఘటన చోటుచేసుకోవడం భద్రతా ఆందోళనలను మరింత పెంచినట్టు చెబుతున్నారు. ఈ ఘటనపై అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. కాగా, అసెంబ్లీ ప్రాంగణంలో ఉంచిన పుష్పగుచ్ఛంలో ఎలాంటి బాంబు లేదని పోలీసులు తేల్చారు.

# సంపాదకీయం

## యుద్ధం ఆగేదెలా...

అటు ఇరాన్, ఇటు అమెరికా రెండు దేశాలు ఎక్కడ తగ్గడం లేదు... ఎవరికి వారు పై చేయి అని చూపించుకొనేందుకు కష్టపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో యుద్ధం ఆగేదెలా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మేం విధించిన డెడ్ లైన్ లోగా హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అయితే హోర్ముజ్‌ను తెరవడానికి.. దాని ద్వారా వచ్చే ఆదాయంలో కొంత వాటాను తమ దేశానికి ఇవ్వాలని ఇరాన్ కొత్త కండీషన్ పెట్టింది. తమను నాశనం చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని.. ఎర్ర సముద్రంలోని మరో కీలక జలసంధిని కూడా టార్గెట్ చేస్తామని వార్నింగ్ ఇచ్చింది. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతోన్న యుద్ధం నెక్స్ట్ లెవల్‌కు వెళ్లే సూచనలు కనిపిస్తు?న్నాయి. హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరుదేశాలు పంతానికి పోతున్నాయి. ఈ జలసంధిని తెరవడానికి గడువు దగ్గరపడుతోందని.. ఆ టైంలోగా తెరవకపోతే విూ అంతు చూస్తామని ఓవైపు ట్రంప్ హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇరాన్ సైతం తగ్గేదేలే అన్నట్టుగా బదులిస్తుంది. అమెరికా బెదిరింపులను టెహ్రాన్ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గల్ఫ్ యుద్ధం తారా స్థాయికి చేరుకుంటుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. హోర్మ్యాజ్ జలసంధిని తెరవకపోతే మంగళవారం ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. సోషల్ మీడియా పోస్టులో బూతులతో ఆయన రెచ్చిపోయారు. ట్రంప్ హెచ్చరికల పట్ల ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఎంబీ ఘలిబఫ్ తీవ్రంగా స్పందించారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అలాంటి చర్యలు తీసుకుంటే.. అమెరికాతోపాటు పశ్చిమాసియా దేశాలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఘలిబఫ్ హెచ్చరించారు. ట్రంప్ ఉద్రిక్తతలు పెంచుతున్నారని.. అస్థిరతలోకి నెట్టేస్తున్నారని.. ఆయన నిర్లక్ష్యంగా అడుగులేస్తున్నారని.. ఇవన్నీ కలిసి అమెరికా పరిస్థితి నరకంలా మారుతోందని ఘలిబఫ్ ఎక్స్‌లో చేసిన పోస్టులో ఆరోపించారు. ఇజ్రాయెల్ ప్రయోజనాలకు అనుగుణంగానే పశ్చిమాసియాలో అమెరికా చర్యలు ఉ టున్నాయని.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాటలు విని గల్ఫ్ ప్రాంతాన్ని ట్రంప్ తగలబెడుతున్నారని ఘలిబఫ్ మండిపడ్డారు. యుద్ధ నేరాల ద్వారా ట్రంప్ సాధించేది ఏమీ లేదని.. ఇరాన్ ప్రజల హక్కులను గౌరవించి.. ప్రమాదకరమైన యుద్ధాన్ని ముగించడమే ఈ సమస్య ఏకైక పరిష్కారమని ఇరాన్ నేత తన పోస్టులో పేర్కొన్నారు. హోర్ముజ్‌ను తిరిగి తెరవడానికి టెహ్రాన్ ఓ కొత్త షరతును విధించింది. యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారంగా.. హోర్ముజ్ మార్గం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని ఇరాన్‌కు కేటాయిస్తేనే.. ఈ జలసంధి గుండా రవాణాకు అనుమతి ఇస్తామని ఇరాన్ అధ్యక్షుడి అధికార ప్రతినిధి సయ్యద్ మహ్మద్ మెహదీ తబాతబెయ్ స్పష్టం చేశారు. అమెరికా మూర్ఖంగా మళ్లీ అవే తప్పులు చేసే ఆలోచనలో ఉన్నట్లయితే.. ప్రపంచదేశాలకు వెళ్లే చమురు, గ్యాస్ సరఫరాను.. వాణిజ్యాన్ని ఒకే ఒక సిగ్నల్‌తో స్తంభింపజేయవచ్చని వారు గ్రహిస్తారు అని ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీకి విదేశాంగ సలహాదారుగా పని చేసిన అలీ అక్బర్ వెలాయతి హెచ్చరించారు. తమ రెసిస్టెంట్ ఫ్రంట్ ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్ మాండేబ్ జలసంధిని టార్గెట్ చేయొచ్చని ఆయన వార్నింగ్ ఇచ్చారు. ప్రపంచ వాణిజ్యంలో 12 శాతం బాబ్ ఎల్ మాండేబ్ జలసంధి ద్వారా జరుగుతోంది. గతంలో ఈ జలసంధిని యెమెన్‌లోని ఇరాన్ అనుకూల హౌతీ బలగాలు టార్గెట్ చేశాయి. ఇప్పటికే హోర్ముజ్ గుండా రవాణా దాదాపుగా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు, గ్యాస్ ధరలు పెరిగాయి. బాబ్ ఎల్ మాండేబ్ ద్వారా నౌకల రాకపోకలు కూడా నిలిచిపోతే దాని ప్రభావం ప్రపంచ దేశాలపై మరింత తీవ్రంగా ఉంటుంది. పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా వైమానిక దళానికి చెందిన రెండు సీ-130 విమానాలను కూల్చేసినట్లు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఇస్ఫహాన్ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు సీ-130 విమానాలు, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లను కూల్చేసినట్లు ఇరాన్ సైన్యం వెల్లడించింది. అమెరికాకు చెందిన ఈ-15ఇ ఫైటర్ జెట్ కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో అమెరికాకు చెందిన ఓ పైలెట్ గల్లంతు కాగా.. ఆ పైలట్ కోసం అమెరికా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించింది. ఈ రెస్క్యూ ఆపరేషన్ కోసం దక్షిణ ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లోని ఓ మూతపడిన విమానాశ్రయాన్ని అమెరికా ఉపయోగించుకుందని ఇరాన్ సైన్యం వెల్లడించింది. పైలట్‌ను రక్షించే నెపంతో, దక్షిణ ఇస్ఫహాన్‌లోని ఒక మూతపడిన విమానాశ్రయంలో మోసపూరితమైన మిషన్‌ను అమెరికా ప్లాన్ చేసిందన్న ఇరాన్ సైన్యం.. ఈ ఆపరేషన్‌ను పూర్తిగా భగ్నం చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఇరాన్ సైన్యం కేంద్ర కమాండ్ ప్రతినిధి ఖతమ్ అల్ అన్బియా ఇబ్రహీం జొల్ఫఘారి అన్నారు. ఈ ఆపరేషన్‌లో రెండు సీ-130 సైనిక రవాణా విమానాలు, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లు ధ్వంసమైనట్లు తెలిపారు. మరోవైపు గల్లంతైన పైలెట్‌ను గుర్తించేందుకు అమెరికా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా అనేక ఎగిరే వస్తువులను.. ఇరాన్ రివల్యూషనరీ కాపాడినట్లు ట్రంప్ వెల్లడించారు. మరోవైపు.. దక్షిణ లెబనాన్‌లోని కఫర్ హట్టా ప్రాంతంపై ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఏడుగురు చనిపోయారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఉన్నట్లు లెబనాన్ సివిల్ డిఫెన్స్ విభాగం అధికారులు వెల్లడించారు.

## మహిళలు రాజకీయాల్లో మరింత చురుకుగా పాల్గొనాలి

### ఎంఎల్సీ వరుదు కళ్యాణి, మాజీ ఎమ్మెల్యే కాటసాని





నంద్యాల, ఏప్రిల్ 6 (శ్రీచక్ర): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి అధ్యక్షతన నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా మహిళా విభాగం ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ మరియు రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా శక్తి సాధికారతపై ప్రసంగించారు. మహిళలు రాజకీయాల్లో మరింత చురుకుగా పాల్గొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మహిళా విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, మహిళలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నంద్యాల మాజీ ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి,ఎమ్మెల్సీ ఇషాక్ భాషా,మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి,జోనల్ ప్రెసిడెంట్ గాజుల శ్వేత రెడ్డి,నంద్యాల జిల్లా అధ్యకురాలు సుజాతమ్మ,రాష్ట్ర సెక్రటరీ వైజా అరుణ ,కర్నూలు జిల్లా మహిళ అధ్యక్షురాలు మరియు మాజీ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక,మహిళా విభాగం జనరల్ సెక్రటరీ శశికళ,మరియు పార్టీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు,మండల మహిళ విభాగం అధ్యక్షులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మంత్రాలయం , ఏప్రిల్ 6,(శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని బూదురు గ్రామంలో జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద 193 పశువులకు పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాది నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వులలో గాలి కుంటు వ్యాధి సోకడం వల్ల తీవ్రమైన జ్వరం వచ్చి నోటిలో కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం జరుగుతుందన్నారు. చూడి పశువులు తీసుకోవడం , పొడి పశువులలో పాల ఉత్పత్తి సామర్థ్యం ,మగ పశువులలో పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం వలన రైతులు ఆర్థికంగా నష్టం జరుగుతుందని, ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల పశు వులలో వ్యాధి నివారణ నివారించవచ్చు అన్నారు. గాలి కుంటు వ్యాధి నివారణ కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని , రైతులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూగూరు గ్రావి ాణ పశు వైద్య ేకండ్రద్ం



వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ వరప్రసాద్ అటెండర్ రాము డు పాల్గొన్నారు.

## జిల్లాలో నీటి భద్రత సాధనకు అధికారుల సమిష్టి కృషి అవసరం

**100 రోజుల ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం**

**చివరి ఆయకట్టు వరకు సాగునీటి సరఫరా లక్ష్యం**

**"యుక్తధార" ద్వారా పనుల పర్యవేక్షణ, జియో ట్యాగింగ్ తప్పనిసరి**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**





నంద్యాల, ఏప్రిల్ 06 (శ్రీచక్ర): జిల్లాలో నీటి భద్రత సాధన ప్రతి అధికారి ప్రధాన బాధ్యతగా భావించి సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో "నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత" అనే అంశంపై అధికారులతో సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.10 మేరకు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో "నీటి భద్రత ? సాగునీటి సంఘాల బాధ్యత" పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు కొనసాగుతుందని, దశలవారీగా అమలు చేయాలని సూచించారు. పనుల అమలు షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 6 నుంచి 15 వరకు పనుల గుర్తింపు, ఏప్రిల్ 16 నుంచి 20 వరకు మంజూరు ప్రక్రియ పూర్తి చేయాలని, ఏప్రిల్ 21 నుంచి జూలై 9 వరకు పనులను అమలు చేయాలని, చివరగా జూలై 10 నుంచి 14 వరకు రిపోర్టింగ్ మరియు డాక్యుమెంటేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నీటి వనరుల సమర్థ వినియోగం, సాగునీటి అందుబాటు పెంపు, భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కన్వర్జెన్స్ కమిటీలో జలవనరుల శాఖ ఎస్ఈతో పాటు వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవనం, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, ఎంఎన్ఆర్ఈజీఎస్, మత్స్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, తహశీల్దార్లు తమ నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని ఎంఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమ ప్రారంభానికి సంబంధించిన ఫోటోలను పకడ్బందీగా డాక్యుమెంట్ చేసి పంపించాలని తెలిపారు. జిల్లాలో నీటి పారుదల వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. కృష్ణా నది నుంచి శ్రీశైలం, పోతిరెడ్డిపాడు ద్వారా విడుదలయ్యే నీరు కేసీ కెనాల్, తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నందికొట్కూరు, డోన్ ప్రాంతాల్లో నీటి ఎద్దడి అధికంగా ఉన్నందున ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. పాములపాడు మండలంలో భూగర్భ జలాల తగ్గుదల దృష్ట్యా పునరుద్ధరణ చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాలువలు పూడికపోవడం, ఫీడర్ మరియు ఫీల్డ్ ఛానల్స్ దెబ్బతినడం వల్ల నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోందని పేర్కొంటూ, పూడికతీత, బుష్ క్లియరెన్స్, కట్టల బలపరిచే పనులను చేపట్టాలని సూచించారు. జిల్లాలోని 330 మైనర్ ఇరిగేషన్ చెరువులను పూర్తి స్థాయిలో నీటితో నింపే లక్ష్యంతో కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ఎంపీడీవోలు సమర్థంగా అమలు చేయాలని సూచించారు. అన్ని పనులను "యుక్తధార" సాఫ్ట్‌వేర్ ద్వారా మానిటర్ చేస్తామని, ప్రతి పనికి జియో ట్యాగింగ్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నేరుగా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. పనుల ప్రతి దశను డ్రోన్ ఫోటోలు, హై రిజల్యూషన్ చిత్రాలు, నివేదికల రూపంలో సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలను స్పష్టంగా నిర్వచించినట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎంపీడీవో, తహశీల్దార్‌లు, గ్రామ స్థాయిలో విఆర్ఓ, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చెరువుల ఆక్రమణలను తొలగించి నీటి వనరులను సంరక్షించడం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సంజామల మండలం ఆకుమల్ల వాటర్‌షెడ్ ప్రాజెక్ట్, డోన్‌లోని ఎత్తుపెంట ప్రాజెక్ట్‌లను అధికారులు సందర్శించి 'రిడ్జ టు వ్యాలీ' విధానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చెక్‌డ్యామ్‌లు, పెర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలపై దృష్టి సారించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల ప్రారంభం, జియో ట్యాగింగ్ తక్షణమే చేపట్టాలని స్పష్టం చేశారు.

## స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం

**విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం**

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**



కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 101 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని బిఎస్సీ నర్సింగ్ చేశాము. కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ లో స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఉండవెల్లికి చెందిన సుధాకర్ రూ. 1 లక్ష 70 వేలు తీసుకోని మోసం చేశాడని కర్నూలు శరీన్ నగర్ కు చెందిన యశోద, నందిని లు ఫిర్యాదు చేశారు. తీసుకున్న అప్పు కట్టినా కూడా ఇంకా అప్పు ఉందని ఎకరా పొలం స్వాధీనం చేసుకున్న భవాని గిడ్డయ్య పై చర్యలు తీసుకోవాలని గూడురు మండలం, గుడిపాడు కు చెందిన ఎర్రగిడ్డయ్య ఫిర్యాదు చేశారు. లోన్ ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, బండిమెట్టకు చెందిన షేక్ ఫాతిమా ఫిర్యాదు చేశారు. నా కుమారుడి కి నంద్యాలకు చెందిన కరీముల్లా గవర్నమెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 5 లక్షలు తీసుకోని మోసం చేశాడని కల్లూరు మండలం, దొడ్డిపాడు గ్రామం కు చెందిన ఖాజా హుస్సేన్ ఫిర్యాదు చేశారు. గుంటూరు కు చెందిన సత్తిబాబు సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ. 2 లక్షలు తీసుకోని మోసం చేశాడని కర్నూలు, చిదంబరరావు స్ట్రీట్ కు చెందిన భరత్ ఫిర్యాదు చేశారు. మా స్థలాన్నిఆక్రమించి గొడవలు చేస్తున్న వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని ఆదోని, కార్వన్ పేటకు చెందిన లక్ష్మీ ఫిర్యాదు చేశారు. సేవ్ ఎర్త్ మనీ పేరుతో హైదరాబాద్ కు చెందిన వ్యక్తులు పేపర్ లోప్రకటన ఇచ్చారు. హైదరాబాద్ కు చెందిన సనా ఉల్లా, చైతన్య, సయిదాబేగం, సత్యలు కలిసి కర్నూలు జిల్లాకు చెందిన 80 మంది (ఒక్కొక్కరి ) నుండి రూ. 12 వేల 500 తీసుకొని ల్యాప్ టాప్ లు ఇచ్చారు. క్యాంటీన్ లు ఏర్పాటు చేయించారు. రూ. 20 వేల జీతం ఇస్తామని చెప్పి మొదటగా నమ్మించారు. కిరాణం సరుకులు పంపుతామని చెప్పి అందరికి మొత్తం రూ. 18 లక్షలు మోసం చేశారని పెద్దకడుబూరు మండలం, బసల దొడ్డి గ్రామం కు చెందిన హేమంత్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు శివ శంకర్, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

## అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

**జోహరాపురం గ్రామంలో విషాదం,**

**పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్న శ్రీనివాస రెడ్డి,**



ఎమ్మిగనూరు, ఏప్రిల్,6 (శ్రీ చక్ర):-ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండల పరిధిలోని జోహరాపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అప్పుల బాధ తట్టుకోలేక శ్రీనివాస రెడ్డి (47) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద విషాద ఛాయలు నెలకొన్నాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, శ్రీనివాస రెడ్డి గత కొంతకాలంగా వ్యవసాయం పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవాడని, వ్యవసాయానికి చేసిన అప్పులు ప్రతి ఏటా పంటలు పండక పోవడంతో, పండించిన పంటకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో చేసుకున్న అప్పులను తీర్చలేక అప్పుల భారమై అప్పుల బాధ భరించలేక మనస్తత్వం చెంది ఒక్కసారిగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వరుసగా పంటలు పూర్తిగా నష్టపోవడంతో, తీసుకున్న అప్పులు కూడా పెరుగుతుండడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే పూర్తిగా నిరాశకు లోనై ఇంటి వద్దే పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో గ్రామంలోని పూర్తిగా విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటన గ్రామ ప్రజలను కలచివేసింది. సమాచారం అందుకున్న నందవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానికుల సమాచారం మేరకు శ్రీనివాస రెడ్డి మంచి రైతు కానీ అప్పులు పూర్తిగా అధికమవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు. ప్రభుత్వం రైతులకు తక్షణ సహాయం క్రింద వెంటనే నష్టపరిహారం అందించాలని గ్రామం లోని రైతులు కోరారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ( ప్రభుత్వాలు పూర్తిగా బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. రైతులపై పెరుగుతున్న అప్పుల భారం, పంట నష్టాలు వంటి సమస్యలు కర్నూలు జిల్లాలో తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు వెంటనే తగిన ప్రతి ఒక్క రైతుకు పూర్తిగా పంట నష్టపరిహారాన్ని అందించి, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నదాతలు, ప్రజా సంఘాల నాయకులు రైతు కూలీ సంఘం నాయకులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి

**ప్రముఖ విభాగాల్లో వైద్య సిబ్బందిని పెంచండి**
**ఆసుపత్రిలో పారిశుద్యానికి అత్యంత ప్రాధాన్యత**
**వేసవి తాపాన్ని ఎదుర్కొనేలా వసతులు ఏర్పాటు చేయాలి**
**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**



నంద్యాల, ఏప్రిల్, 06 (శ్రీచక్ర): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఛాంబర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పన మెరుగల వైద్య సేవలు అందించేందుకు పరికరాలు సంబంధిత అంశాలపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.జిలానీ, డిసిహెచ్ఎస్ డా.ఓ.లలిత, ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీర్లు నరసింహారెడ్డి జయరాంరెడ్డి, ఎడి మస్తాన్, డ్రగ్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న మొత్తం 84 ఎయిర్ కండీషనర్లలో 29 పనిచేయకపోవడం గమనించిన కలెక్టర్, వాటిలో మరమ్మతులకు అనువైనవి ఎన్ని, కొత్తగా అవసరమయ్యేవి ఎన్ని అన్నదానిపై తక్షణ అంచనా వేయాలని ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, పాథాలజీ మరియు మైక్రోబయాలజీ ల్యాబ్‌లలో ఏసీలు సమర్థంగా పనిచేయడం అత్యవసరమని పేర్కొంటూ, ఈ విభాగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏసీలు తరచూ పాడవ్వడానికి ప్రధాన కారణంగా తలుపుల లోపాలు ఉన్నాయని గుర్తించి, డోర్ క్లోజర్లు ఏర్పాటు చేయాలని, అల్యూమినియం డోర్ల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. అలాగే, ఏసీల వినియోగంపై అవగాహన కల్పించేందుకు 24 డిగ్రీల వద్ద ఉంచాలనే సూచనలతో స్టిక్కర్లు ప్రతిచోటా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తక్కువ ఉష్ణోగ్రతల వద్ద వినియోగం యంత్రాలపై భారం పెంచుతుందని హెచ్చరించారు. అవసరాన్ని బట్టి షిఫ్టుల వారీగా ఏసీల వినియోగాన్ని అమలు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఎయిర్ కంప్రెషర్లు మరియు వ్యాక్యూమ్ సిస్టమ్స్ సరిగా పనిచేసేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఐసీయూ రోగులకు ఇది ఇబ్బందికరమని చెప్పి, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి వచ్చే సోమవారంలోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. డయాలసిస్ యూనిట్ (నెఫ్రోప్లస్) భాగంగా, 14 బెడ్లతో రోజుకు 40-45 డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అయితే ఒప్పంద నిబంధనల ప్రకారం అవసరమైన నలుగురు శిక్షణ పొందిన వైద్యుల స్థానంలో కేవలం ఇద్దరు మాత్రమే ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడం, ఆయుర్వేద వైద్యులను నియమించడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే అర్హత కలిగిన నిపుణులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. డయాలసిస్ సేవలు ఉ.6.గం.ల నుంచి రా.12 గం.ల వరకు కొనసాగుతున్న నేపథ్యంలో, అత్యవసర పరిస్థితుల్లో రాత్రి కూడా కనీసం ఒక బెడ్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి మూడు యంత్రాలకు ఒక టెక్నీషియన్ ఉండేలా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. వైద్య పరికరాల విషయంలో థైరాయిడ్ పరీక్షలకు అవసరమైన సదుపాయాలు, రిఫ్రిజిరేటెడ్ సెంట్రిఫ్యూజ్ వంటి పరికరాల లభ్యతపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాంకేతిక పర్యవేక్షణకు అర్హత కలిగిన సిబ్బంది నియామకంపై దృష్టి సారించాలని సూచించారు. సెక్యూరిటీ సిబ్బంది కొరతపై కూడా కలెక్టర్ స్పందిస్తూ నిబంధనల ప్రకారం 67 మంది ఉండాల్సిన చోట ప్రస్తుతం 49 మంది మాత్రమే ఉండటంతో మిగిలిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. సిబ్బంది వయస్సు, ఆరోగ్యం, హాజరు వంటి అంశాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆసుపత్రి భద్రత, మౌలిక వసతుల పరంగా ఫైర్ ఆడిట్, బ్లడ్ బ్యాంక్ ఆడిట్, ఎలక్ట్రిసిటీ మరియు మెడికల్ ఆక్సిజన్ ఆడిట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అంశాలపై స్పందించని విభాగాలకు వెంటనే లేఖలు పంపి, తదుపరి సమీక్షకు హాజరు కావాలని సూచించారు. భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, పాత నీటి ట్యాంక్ ప్రమాద స్థితి వంటి అంశాలపై కూడా చర్చించి, తాత్కాలికంగా నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని, శాశ్వత పరిష్కారం కోసం కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రేడియాలజీ విభాగంలో ఎక్స్‌రే యూనిట్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆసుపత్రి సేవల్లో నిర్లక్ష్యం కనబరిస్తే సంబంధిత విభాగాధిపతులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సేవల నాణ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తానని తెలిపారు.

## ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగా ప్రసాద్ ను కలిసిన మారంరెడ్డి



శ్రీధర్ రెడ్డి కోట : ఏప్రిల్ 6 (శ్రీ చక్ర):ప్రముఖ పారిశ్రామిక వేత్త,టీడీపీ సీనియర్ నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్ ను కోట మండలం రైతు సంఘం అధ్యక్షులు మారంరెడ్డి. శ్రీధర్ రెడ్డి హృదయపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సోమవారం ప్రముఖ పారిశ్రామికవేత్త,టిడిపి సీనియర్ నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్ జన్మదిన సందర్భంగా కోట మండల రైతు సంఘం అధ్యక్షులు మారం రెడ్డి.శ్రీధర్ రెడ్డి కలిసి పూల మాలలు,శాలు వాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం మారంరెడ్డి.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో టిడిపి పార్టీ బలోపేతనానికి కృషి చేసిన ఘనత కొండేపాటి.గంగా ప్రసాద్ కు దక్కుతుందని గుర్తు చేశారు.అంతేకాకుండా కొండేపాటి. గంగా ప్రసాద్ మృదుస్వభావి, స్నేహపూర్వకంగా అందరితో కలిసి టిడిపి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా ఉంటూ గూడూరు, వెంకటగిరి,సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో ఉండే నాయకులు,కార్యకర్తలు, అభిమానులను ఏకతాటిపై నడిపిస్తూ టిడిపి పార్టీ ని ముందుకు తీసుకెళుతున్నారని తెలియజేశారు.

## శ్రీ సంగమేశ్వరునికి మహాన్యాస రుద్రాభిషేకం, ధ్వజారోహరణం కొడి వస్త్రముల సమర్పణ



కోట : ఏప్రిల్ 6 (శ్రీ చక్ర):కోట మండలం గూడలి గ్రామంలో వెలసియున్న శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు సోమవారం ఆలయకమిటీ సభ్యులు,టీడీపీ నాయకులు పల్లెమల్లు. వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు,ఆలయ ప్రధాన అర్చకులు కార్తీక్ స్వామి చేతుల మీదుగా స్వామి అమ్మ వార్లకు మహాన్యాస రుద్రాభిషేకం ధ్వజారోహరణం కొడి వస్త్రముల సమర్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.ధ్వజస్తంభం వద్ద ప్రధాన కార్యమైన కొడి ముద్దలను భక్తులపైకివేయగా ఎంతో పవిత్రంగా భావించే కొడి ముద్దల కోసం భక్తులు తమ కొంగులతో భక్తిశ్రద్ధలతో పోటీపడి స్వామి అమ్మవార్ల కొడి ముద్దలను దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైస్ మిల్లులను పరిశీలించిన రెవెన్యూ అధికారులు





కోట : ఏప్రిల్ 6 (శ్రీ చక్ర):కోట మండలంలోని కోట క్రాస్ల రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ హరిహర రైస్ మిల్లు,వీరారెడ్డి సత్రం లోని ధనలక్ష్మి రైస్ మిల్లులను సోమవారం రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కోట మండల తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు ఆదేశాల మేరకు రైస్ మిల్లులను పరిశీలించడం జరిగిందని వీఆర్వోలు మాధవయ్య ,వెంకట రమణమ్మలు తెలిపారు.అకాల వర్షాలు వస్తున్న నేపథ్యంలో రైస్ మిల్లు లో ఉన్న రైతుల ధాన్యం నిల్వ యొక్క వివరాలను తెలుసుకోవడానికి రావడం జరిగిందన్నారు.అదేవిధంగా రైస్ మిల్లు లో ధాన్యం భద్రత విధానంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మిల్లర్ లకు తెలియజేశారు.

## సత్యవేడు అంబేత్కర్ భవన నిర్మాణానికి సహకరించండి కోరిన ఎమ్మెల్యే ఆదిమూలం



వరదయ్యపాలెం ఏప్రిల్ 6(శ్రీ చక్ర) కేవిబి పురంలో టిటిడి కల్యాణ మండపం నిర్మించాలికలెక్టర్ వెంకటేశ్వర్లుకు విన్నవించిన ఎమ్మెల్యే ఆదిమూలంసత్యవేడు లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేత్కర్ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించి సహకరించాలని, కేవిబి పురంలో టిటిడి కల్యాణ మండపం నిర్మించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు కు విన్నవించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి ఫిర్యాదుల దినాన్ని పురస్కరించుకొని సత్యవేడు బార్ అసోసియేషన్ కార్యదర్శి రాజ తో కలిసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై ఈ మేరకు వినతి పత్రాన్ని కలెక్టర్ కు అందజేశారు.అలాగే కేవిబి పురం లో టిటిడి కల్యాణ మండపం నిర్మించాలని అందుకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కలెక్టర్ ను కోరగా వెంటనే కేవిబి పురం తహసీల్దార్ కు ఫోన్ చేసి స్థలం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే కల్యాణ మండపం నిర్మాణానికి టిటిడి ఈఓ కు లేఖ రాస్తానని కలెక్టర్ తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు.తన వినతులకు కలెక్టర్ వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు.

## నాబల కాలువ ఆక్రమణ ను పరిశీలించాలి



కోట : ఏప్రిల్ 6 (శ్రీ చక్ర):నాబల కాలువ ఆక్రమణను రెవిన్యూ అధికారులు పరిశీలించాలని కోట మండల మాజీ జెడ్ పి టి సి ఉప్పల.ప్రసాద్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా సోమవారం కోట తాహసిల్దార్కటారి.జయ జయ రావును కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ మేరకు కొత్తపట్నం గ్రామ పంచాయితిలో ఉయ్యాలమ్మ సాగునీటి చెరువు కాలువ అయిన నాబల కాలువ ఆక్రమణకు గురవుతుందని పరిశీలించి చర్యలు తీసుకోవాలని,ఈ కాలువ ద్వారా 350 ఎకరాలు సాగునీరు అందిస్తోందని,దీన్ని పూర్తిగా ఆక్రమిస్తే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తాహసిల్దార్ కు వివరించారు. అనంతరం స్పందించిన తాహసిల్దార్ కాలువను పరిశీలించి ఆక్రమణ లేకుండా చూస్తామని తెలిపినట్లు మాజీ జడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్ తెలియజేశారు.

## సూళ్లూరుపేట పారిశ్రామికవేత కొండేపాటి గంగా ప్రసాద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



వరదయ్యపాలెం ఏప్రిల్ 6(శ్రీ చక్ర పారిశ్రామికవేత్త, కొండేపాటి గంగా ప్రసాద్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలురాజకీయ అనుభవజ్ఞులు, పేదల పట్ల సేవా భావం కలిగిన నాయకులు మరియు ఎన్నికల సమయంలో నాలుగు నియోజకవర్గాలను ఏకతాటిపై నడిపించిన సీనియర్ మోస్ట్ టీడీపీ నాయకులు అయిన గంగా ప్రసాద్‌కి,సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం సత్యవేడు యువ నాయకుడు, జడ్పిటిసి కోనేటి సుమన్ కుమార్ సత్యవేడునియోజకవర్గప్రజలు మరియు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అందరి తరపున ఇవే మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.ప్రజలఅభిమానంఎల్లప్పుడూ మీకు ఉండాలని కోరుకుంటున్నాము. మీ అభిమానులు మరియు సత్యవేడు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు.

## ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి.గంగా ప్రసాద్ ను కలిసిన కోట టీడీపీ నాయకులు



కోట : ఏప్రిల్ 6 (శ్రీ చక్ర):ప్రముఖ పారిశ్రామిక వేత్త,టీడీపీ సీనియర్ నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్ ను కోట మండలంలోని తిరుపతి పార్లమెంట్ మైనారిటీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు హృదయపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సోమవారం ప్రముఖ పారిశ్రామికవేత్త,టిడిపి సీనియర్ నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్ జన్మదిన సందర్భంగా సూళ్లూరుపేట లోని కొండేపాటి గంగప్రసాద్ నివాసంలో ఆయన్ను కలిసి పూలమాలలు,శాలు వాతో సత్కరించి బొకే లను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ గూడూరు, వెంకటగిరి,సూళ్లూరు పేట, సత్యవేడు నియోజకవర్గాల్లో ఉండే నాయకులు,కార్యకర్తలు, అభిమానులను ఏకతాటిపై నడిపిస్తూ టిడిపి పార్టీని ముందుకు తీసుకెళుతున్నారని తెలియజేశారు.అదేవిదంగా ఈ ప్రాంతంలో టీడీపీ పార్టీ బలపడడానికి ప్రధాన కారకులు కొండేపాటి గంగప్రసాద్ అని చెప్పవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పలగాటి.భాస్కర్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు మైనార్టీ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్, పెన్నక్క చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ నెల్లూరు మోహన్ రెడ్డి, వెంకన్నపాలెం పంచాయతీ సర్పంచ్ కోకర్ల మధు యాదవ్, కోట మండల వ్యవసాయ సంఘం అధ్యక్షులు మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ప్రమీల,మండల రైతు మాజీ అధ్యక్షులు పాధర్తి కోటారెడ్డి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి కోటేశ్వరరావు,చిట్టేడు సొసైటీ చైర్మన్ చాపల.శ్రీనివాసులు,జిల్లా మహిళా కార్యదర్శి సిద్దపరెడ్డి పోలమ్మ,ఎంపీటీసీ షంషుద్దీన్ సురేష్,సోషల్ మీడియా అధ్యక్షులు మధుబాబు,కర్లపూడి కోటేశ్వరరావు,నందన మోహన్, బూత్ ఇంచార్జ్ మునిరాజా, మధుబాబు,తదితర టిడిపి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టండి.ఆర్ డి ఓ కు డీవీఎంసీ మెంబెర్ విజ్ఞప్తి.

**సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రత్యక అధికారిగా భాధ్యతలకు సత్కారం**

సోమవారం,ఏప్రిల్ 06: ప్రాంతంలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని డీవీఎంసీ మెంబెర్,దేవాంగ అభ్యుదయ సేవా సంఘం ప్రెసిడెంట్ గుత్తి త్యాగరాజు, రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) డి.దేవేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.సూళ్లూరుపేటలోని ఆర్‌డీఓ కార్యాలయంలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీలో పలు ముఖ్య అంశాలపై చర్చించారు. జసూళ్లూరు పేట,నాయుడుపేట మున్సిపాలిటీ లకు ప్రత్యేక అధికారిగా భాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆర్‌డీఓ దేవేందర్ రెడ్డిని గుత్తి త్యాగరాజు సంప్రదాయ వస్త్రంతో సత్కరించారు.చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, వేసవి కాలంలో చేనేత దుస్తులు ధరించడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని త్యాగరాజు తెలిపారు.ప్రజలకు సంబంధించిన సున్నితమైన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆర్‌డీఓ దేవేందర్ రెడ్డి హామీ ఇచ్చారు.తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై కీలక సమస్యపై వినతిపత్రం సమర్పించినట్టు త్యాగరాజు తెలిపారు.

## ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి.గంగా ప్రసాద్ ను కలిసిన షేక్ మస్తాన్



బాష కోట : ఏప్రిల్ 6 (శ్రీ చక్ర):ప్రముఖ పారిశ్రామిక వేత్త,టీడీపీ సీనియర్ నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్ ను కోట మండలం గూడలి పంచాయతీ చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ బాష హృదయపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సోమవారం ప్రముఖ పారిశ్రామికవేత్త,టిడిపి సీనియర్ నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్ జన్మదిన సందర్భంగా కలిసి పూలమాలలు ,శాలువా తో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# కొత్త రుచితో పుదీనా టమాటా పచ్చడి.. ఇదొక్కడి యాడ్ చేస్తే చాలు..!



టమాటో పచ్చడి అంటేనే చాలామందికి నోరూరుతుంది. టమాటో పచ్చడిని పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టంగా తింటారు. ఏ కాలంలోనైనా టమాటా పచ్చడి టేస్ట్ అద్భుతంగా ఉంటుంది. అయితే టమాటా పచ్చడి సూపర్ టేస్టీ గా రావాలంటే పుదీనాతో పచ్చడి చేసుకుంటే సరి.. రుచి అద్భుతంగా ఉంటుంది. అన్నంలోకి మాత్రమే కాదు టిఫిన్స్ లోకి కూడా పుదీనా టమాటా పచ్చడి అద్దిరిపోతుంది. మరి పుదీనాతో టమాటా పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి..? పుదీనా టమాటా పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. టమాటాలు మూడు లేదా నాలుగు పెద్దవి, పుదీనా ఆకులు ఒక కప్పు, అల్లం ముక్క, పచ్చిమిర్చి తగినన్ని, వెల్లుల్లి రెబ్బలు, చింతపండు, ఉప్పు రుచికి సరిపడా, నూనె, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు తీసుకోవాలి. ఇప్పుడు పుదీనా టమాటా పచ్చడి తయారీ విధానం చూస్తే.. ముందుగా ఓ గిన్నె తీసుకోవాలి. స్టవ్ ఆన్ చేసి గిన్నె పెట్టుకోవాలి. ఆ తర్వాత నూనె పోయాలి. నూనె వేడెక్కిన తర్వాత అందులో పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి వేసి వేయించుకోవాలి. " ఇప్పుడు అందులో శుభ్రం చేసుకున్న పుదీనా ఆకులు వేసుకోవాలి. పచ్చివాసన పోయేంత వరకూ వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే గిన్నెలో టమాటా ముక్కలు, చింత పండు, కొద్దిగా ఉప్పు వేసి మూత పెట్టుకోవాలి. టమాటాలు మెత్తగా ఉడికే వరకూ మగ్గించుకోవాలి. ఇప్పుడు వేయించిన ఆ మిశ్రమాన్ని మిక్సీ జార్ లో వేయాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి మెత్తని పేస్ట్ మాదిరి చేసుకోవాలి. ఇప్పుడు మరో గరిటెలో నూనె వేసి అందులోనే ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు వేసి వేయించుకోవాలి. ఇప్పుడు ఈ తాళింపును పచ్చడిలో కలిపితే సరి.. నోరూరించే సూపర్ టేస్టీ టమాటా పుదీనా పచ్చడి రెడీ అయినట్టే..

# రెస్టారెంట్ స్టైల్ లో చికెన్ టిక్కా.. ఇంట్లోనే ఈజీగా ఇలా చేసుకోండి..!



చికెన్ అనగానే చాలామందికి నోరూరుతుంది. చికెన్ ను పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఇష్టంగా తింటారు. చికెన్ తో అనేక రకాల వెరైటీస్ చేసుకుని తింటూంటారు. అయితే చికెన్ టిక్కా ఎప్పుడైనా ట్రై చేశారా..? ఎప్పుడూ రెస్టారెంట్ లోనే దొరికే ఈ వంటకాన్ని ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోవచ్చు. చికెన్ టిక్కాను ఎలా తయారు చేయాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? ఇక్కడ తెలుసుకుందాం..చికెన్ టిక్కా తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. తగినంత చికెన్, పెరుగు మ్యారినేషన్ కోసం, అల్లం వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, కారం, పసుపు, గరం మసాలా, జీలకర్ర పొడి, ధనియాల పొడి, మిరియాల పొడి, ఉప్పు, రుచికోసం ఆవ నూనె, ఉల్లిపాయలు తీసుకోవాలి. మరిన్ని కనుగొనండి ఆంధ్రా స్టైల్ మామిడికాయ తురుము పచ్చడి.. ఇలా చేస్తే రుచి సూపర్!" చికెన్ టిక్కా తయారీ విధానం చూస్తే.. ముందుగా చికెన్ ను మ్యారినేషన్ చేసుకోవాలి. ఒక గిన్నెలో నిమ్మరసం, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కలపాలి. ఆ మిశ్రమాన్ని చికెన్ ముక్కలకు వేసి బాగా పట్టించాలి. అలా 15 నిమిషాల పాటు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మరో గిన్నె తీసుకోవాలి. అందులో పెరుగు, మిరియాల పొడి, ధనియాల పొడి, కారం, పసుపు, గరం మసాలా, జీలకర్ర పొడి వేసి బాగా మిక్సింగ్ చేసుకోవాలి. ఈ పేస్టును చికెన్ ముక్కలకు బాగా పట్టించాలి. అలా ఈ మిశ్రమాన్ని కూడా కొద్దిసేపు మ్యారినేట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఓవెన్ పై మ్యారినేట్ చేసిన చికెన్ ముక్కల్ని అమర్చి 15 నిమిషాల పాటు బేక్ చేసుకోవాలి. చికెన్ ముక్కల్ని తిప్పుతూ గ్రిల్ చేసుకోవాలి. మధ్యమధ్యలో కొద్దిగా బటర్ రాస్తే రుచిగా ఉంటుంది. ఇప్పుడు మ్యారినేట్ చేసిన చికెన్ ముక్కలను పుల్లలకు గుచ్చాలి. మధ్య మధ్యలో ఉల్లిపాయ, కాప్సికమ్ ముక్కలను కూడా చేర్చుకోవచ్చు.

# పేపర్ కప్పులో టీ, కాఫీ తాగుతున్నారా? అయితే, ఇది తెలుసుకోవాల్సిందే..!!

రోజువారీ జీవనం వేగంగా మారిపోతోంది. ఈ వేగంలో కాఫీ, టీ తాగే అలవాటు కూడా మారుతోంది. చాలా మంది పేపర్ గ్లాసులు వాడటం అలవాటు చేసుకున్నారు. ప్రయాణాలు.. బయట ఉన్న సమయంలో చాలా మంది ఈ పేపర్ కప్స్ లో టీ– కాఫీ తాగుతూ కనిపిస్తారు. అయితే.. ఈ కప్స్ లో తాగటం ఆరోగ్యానికి డేంజర్ అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడి కాఫీ, టీతో ఈ ప్లాస్టిక్ పొరలోని రసాయనాలు కలిసిపోతే, అవి జీర్ణవ్యవస్థకు హాని చేస్తాయి. హార్మోన్లలో మార్పులు, కీళ్ల నొప్పులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారి తీస్తాయని శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నాయి. ఈ మధ్య కాలంలో బయట టీ స్టాళ్లు.. ప్రయాణాల్లో ఎక్కువగా పేపర్ కప్స్ లోనే టీ, కాఫీ తాగుతూ కనిపిస్తున్నారు. ఇలా పేపర్ కప్స్ లో తాగటం వలన ఆరోగ్యానికే కాదు, పర్యావరణానికి డేంజర్ అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగితం కప్పులలో చాలా సన్నని ప్లాస్టిక్ పొర ఉంటుంది. దీన్నే మైక్రోప్లాస్టిక్స్ అంటారు. ఈ మైక్రోప్లాస్టిక్స్ ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. అదే విధంగా చాలా మంది కర్రీ పాయింట్స్ నుంచి పార్సిల్ సైతం ప్లాస్టిక్ కవర్స్ లోనే తీసుకెళ్తారు. వేడి పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లి తినడం వల్ల శరీరానికి హాని చేసే కారకాలు మన శరీరంలో చేరుతున్నాయి. ఇవి రక్తంలోని హార్మోన్ల వ్యవస్థను దెబ్బతీసి రక్తప్రసరణకు ఆటంకంగా మారుతాయి. ఇలా... అన్నీ ప్లాస్టిక్ ప్యాకెట్లు.. పేపర్ కప్స్ లో ఉంచి శరీరంలోకి తీసుకోవటం ఆరోగ్యానికి మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. వెంటనే ఈ ఫలితాలు కనిపించకపోయినా.. దీర్ఘకాలంలో మాత్రం సమస్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. మరిన్ని కనుగొనండి కాఫీ ౹వజీ టీ కాఫీలు కాగితం ప్లాస్టిక్ వినియోగం తగ్గించకపోతే చాలా ప్రమాదమని వైద్యులు, పర్యావరణ వేత్తలు హెచ్చరిక చేస్తున్నారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా ఏటా 10 లక్షలమంది ప్రాణాలు కోల్పోతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. వేడి కాఫీ, టీతో ఈ ప్లాస్టిక్ పొరలోని రసాయనాలు కలిసిపోతే, అవి జీర్ణవ్యవస్థకు హాని చేస్తాయి. కీళ్ల నొప్పులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారి తీస్తాయని శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నాయి.

# నిద్రలేమి సమస్యతో బాధపడేవారు వెంటనే వీటిని తినండి!

ప్రస్తుత సమాజంలో నిద్రలేమి సమస్య అతి పెద్ద సమస్యగా ఇబ్బంది పెడుతోంది. అనేక సమస్యలతో సతమతమవుతూ సరిగ్గా నిద్రపోలేక, పడుకుంటే నిద్రరాక చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారు. అలా నిద్రలేమి సమస్యతో బాద పడుతున్న వారు రోజువారీ ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకుంటే నిద్రలేమి సమస్యకు చెక్ పెట్టొచ్చు అని చెప్తున్నారు డైటీషియన్లు. నిద్రలేమి సమస్యతో అనేక వ్యాధులు అయితే కొన్ని రకాల పండ్లతో పాటు, కొన్ని రకాల ఆకు కూరలు తీసుకోవడం వలన కొంత మేరకు నిద్రలేమి సమస్యను అరికట్టవచ్చునని చెప్తున్నారు. ఎక్కువగా నాన్ వెజ్ తినే వారికి తొందరగా డైజెషన్ కాకపోవడం వలన నిద్రకు భంగం కలుగుతుంది. నిద్రలేమి సమస్యతో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇక మానసిక ఒత్తిడికి గురవుతున్న వారిలో కూడా నిద్రలేమి సమస్య ఉంటుంది. ఇలా చేస్తే రుచి సూపర్!" నిద్రలేమితో బాధ పడేవారు ఇలా జాగ్రత్త పడాలి నిద్ర వేళకు ఫుల్ గా భోజనం చేయడం జీర్ణక్రియ ఆలస్యంగా జరగడం వలన కడుపులో ఆయాసం ,ఉబ్బరం తో రాత్రంతా నిద్రకు భంగం కలుగుతుంది. ఇలా అనేక కారణాలు నిద్రలేమిని కలిగిస్తాయి. కనుక నిద్రలేమి సమస్యతో బాధ పడే వారు భోజనం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవి తింటే నిద్రలేమి సమస్యకు చెక్ నిద్రలేమి సమస్యకు ఆకుకూరలతో చెక్ పెట్టొచ్చు. పాలకూర, బచ్చలికూర, తోటకూర వంటి ఆకుకూరల్లో మెగ్నీషియం,కార్బోహైడ్రేట్లు మిటమిన్లు ఏ,విటమిన్ సి, విటమిన్ కె,తోపాటు ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది. వీటిని తింటే నిద్రలేమి సమస్యకు చెక్ పెట్టొచ్చు. ఆకుకూరలు తొందరగా జీర్ణం అవ్వటం




వలన నిద్రకు ఎలాంటి సమస్య ఉండదు. పాలకూర తో గుండె సంబంధిత వ్యాధులను కూడా కట్టడి చేసే అవకాశం ఉందని వైద్యనిపుణులు సూచిస్తుంటారు పండ్లు, పాలతో పాటు ఇవి తింటే మంచి నిద్ర అయితే ఆకుకూరలు మాత్రమే కాదు కొన్నిరకాల పండ్లు కూడా మన నిద్రకు ఎంతగానో ఉపయోగపడతాయి. కివీ, చెర్రీస్ వంటి పండ్లు, అరటిపండ్లు మన నిద్రను మేరుగుపరచటం కోసం దోహదం చేస్తాయి. గోరు వెచ్చని పాలలో దాల్చిన చెక్క పొడిని గ్లాసు పాలలో చిటికెడు పొడిని కలుపుకొని తాగితే మంచి నిద్ర పడుతుంది. వాల్ నట్స్, గుమ్మడి గింజలు, చియా సీడ్స్ వంటి వాటిని ఆహారంలో తీసుకోవటం వలన కూడా నిద్ర బాగా పడుతుంది. మంచి పోషకాహారం మన నిద్రను మెరుగుపరుస్తుంది.

# కొవ్వుతోనే కొవ్వుకు చెక్: మన శరీరంలోని 'బ్రౌన్ ఫ్యాట్' రహస్యం..



పెరుగుతున్న బరువును తగ్గించుకోవడానికి ఇకపై కేవలం ఆకలిని చంపుకోవాల్సిన అవసరం లేదు. మన శరీరంలోని కొవ్వునే ఇంధనంగా మార్చి, కరిగించే సరికొత్త అద్భుత వ్యవస్థను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. శరీరంలో పేరుకుపోయిన 'తెల్ల కొవ్వు'ను కరిగించే 'బ్రౌన్ ఫ్యాట్' నెట్‌వర్క్‌ను ఎలా యాక్టివేట్ చేయవచ్చో వివరిస్తూ 'నేచర్ కమ్యూనికేషన్స్' జర్నల్‌లో ప్రచురితమైన ఈ పరిశోధన వివరాలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ‾ ఫ్యాట్' (తెల్ల కొవ్వు) మనం తినే ఆహారాన్ని శక్తిగా మార్చి నిల్వ చేస్తుంది. ఇది ఎక్కువైతేనే స్థూలకాయం వస్తుంది. కానీ 'బ్రౌన్ ఫ్యాట్' దీనికి పూర్తి విరుద్ధం. ఇది ఒక 'జీవక్రియ సింక్' లాగా పనిచేస్తుంది. అంటే, ఇది పోషకాలను కొవ్వుగా నిల్వ చేయనివ్వకుండా, వాటిని వేగంగా వేడి రూపంలోకి మార్చి కరిగించేస్తుంది. ఈ ప్రక్రియనే శాస్త్రవేత్తలు 'థర్మోజెనిసిస్' అని పిలుస్తారు. మరిన్ని కనుగొనండి. విభజించి పాలించు! ఈ బ్రౌన్ ఫ్యాట్ సమర్థవంతంగా పనిచేయాలంటే దానికి దట్టమైన నరాలు, రక్తనాళాల నెట్‌వర్క్ అవసరం. ఈ నెట్‌వర్క్‌ను నిర్మించడంలో 'హఒమె3' అనే ప్రొటీన్ కీలక పాత్ర పోషిస్తుందని న్యూయార్క్ యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. విశేషమేమిటంటే, ఈ ప్రొటీన్ విడుదలైన తర్వాత రెండు భాగాలుగా విడిపోతుంది. ఒక భాగం రక్తనాళాల వృద్ధిని చూసుకుంటే, మరో భాగం నరాల వ్యవస్థను విస్తరిస్తుంది. ఈ రెండు వ్యవస్థలు కలిసి బ్రౌన్ ఫ్యాట్‌కు అవసరమైన ఆక్సిజన్, పోషకాలను అందిస్తూ కొవ్వును వేడి రూపంలో కరిగిస్తాయి. స్థూలకాయానికి సరికొత్త మందు? ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న బరువు తగ్గే మందులు ఎక్కువగా ఆకలిని తగ్గించడం ద్వారా పనిచేస్తాయి. కానీ ఈ కొత్త పరిశోధన ఆకలిని తగ్గించడం కంటే, శరీరం వినియోగించుకునే శక్తిని పెంచడంపై దృష్టి పెడుతోంది. సుమారు 15,000 మందిపై జరిపిన విశ్లేషణలో, స్థూలకాయం ఉన్నవారిలో ఈ ాఒమె3 ప్రొటీన్ పనితీరు ఇన్సులిన్ సున్నితత్వాన్ని, కొవ్వు కణజాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందని తేలింది. పరిశోధనలో తేలిన నగ్న సత్యాలు.. మౌలిక సదుపాయాలే ముఖ్యం.. "కేవలం శరీరంలో బ్రౌన్ ఫ్యాట్ ఉంటే సరిపోదు, అది వేడిని ఉత్పత్తి చేయడానికి కణజాలం లోపల సరైన మౌలిక సదుపాయాలు (నరాలు, రక్తనాళాలు) ఉండాలి" అని ఈ అధ్యయన సీనియర్ రచయిత ఫర్నాజ్ షమ్సి వివరించారు. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో ఈ ప్రొటీన్ లేని పక్షంలో అవి చలిని తట్టుకోలేకపోయాయని, వాటిలో కొవ్వు కరిగే ప్రక్రియ మందగించిందని గుర్తించారు. భవిష్యత్తులో ఈ ాఒమె3 ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకుని తయారు చేసే చికిత్సలు స్థూలకాయం, జీవక్రియ సంబంధిత వ్యాధులకు శాశ్వత పరిష్కారం చూపే అవకాశం ఉంది

# ఎండాకాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలా? ఇవి ఆహారంలో తీసుకోండి!



ఎండాకాలం రాగానే సూర్యుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.అధిక వేడి వల్ల డీహైడ్రేషన్, నీరసం మరియు కడుపు సంబంధిత సమస్యలు రావడం సహజం. అయితే ఈ వేడి నుండి మన శరీరాన్ని కాపాడుకోవాలంటే ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవాలి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రకృతి ఇచ్చిన అమృతం పుచ్చకాయ వేసవిలో అందరూ ఇష్టపడే పండు పుచ్చకాయ. ఇందులో నీటి శాతం చాలా ఎక్కువ. ఇది శరీరాన్ని ఎక్కువ సేపు హైడ్రేట్‌గా, చల్లగా ఉంచుతుంది. ఇందులోని 'లైకోపిన్' చర్మాన్ని ఎండ దెబ్బ నుండి కాపాడుతుంది. పొట్టను చల్లగా ఉంచడంలో పుచ్చకాయ అద్భుతంగా పనిచేస్తుంది. మరిన్ని కనుగొనండ చల్లదనానికి కేరాఫ్ అడ్రస్ కీరా దోసకాయ కీరా దోసకాయలో నీరు మరియు పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో క్యాలరీలు తక్కువ, పీచు పదార్థం ఎక్కువ. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా మలబద్ధకాన్ని నివారిస్తుంది. వేసవిలో బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక గొప్ప ఆహారం . ఇది శరీరాన్ని లోపల నుండి చల్లబరుస్తుంది. పోషకాల గని అనాస పండు అనాస పండులో 'బ్రోమెలైన్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఎండ వల్ల కలిగే మంటను, సన్ బర్న్‌ను తగ్గిస్తుంది. విటమిన్ సి, బి6 మరియు మెగ్నీషియం వంటి పోషకాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. ఇది మీ శరీరానికి తక్షణ శక్తిని అందిస్తూ, ఎండ తీవ్రతను తట్టుకునేలా చేస్తుంది. కడుపుకి హాయినిచ్చే పెరుగు పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తాయి. ఇందులో ఉండే క్యాల్షియం ఎముకలను దృఢంగా ఉంచుతుంది. ప్రోటీన్ ఎక్కువగా ఉండటం వల్ల వేసవిలో నీరసం రాకుండా ఇది కాపాడుతుంది. నిత్యం పెరుగు వాడటం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం తక్షణ శక్తికి మూలం నిమ్మకాయ శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపడంలో నిమ్మకాయ కీలక పాత్ర పోషిస్తుంది. నిమ్మరసం తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది చర్మాన్ని తాజాగా ఉంచుతూ, వేసవి వేడి వల్ల కలిగే అలసటను తక్షణమే దూరం చేస్తుంది. తక్కువ ఖర్చుతో కూడిన గొప్ప డ్రింక్ ఇది.ఈ ఆహార పదార్థాలను మీ రోజువారీ డైట్‌లో చేర్చుకోవడం ద్వారా వేసవి తాపం నుండి సులభంగా తప్పించుకోవచ్చు.



# స్పోర్ట్స్ న్యూస్


## ఆ వ్యూహాలను ధోని అస్సలు ఒప్పుకోడు: అంబటి రాయుడు



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో 43 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ ఓడిన సంగతి తెలిసిందే. ఈ పరాజయంపై మాజీ క్రికెటర్ అంబటి రాయుడు స్పందించాడు. సీఎస్కే ఓటమికి బౌలింగ్ వైఫల్యమే ప్రధాన కారణమని అతడు వ్యాఖ్యానించాడు. ఆర్సీబీ బ్యాటర్ల దెబ్బకు చివరి నాలుగు ఓవర్లలో ఏకంగా 78 పరుగులు సమర్పించింది. డెత్ ఓవర్లలో చెన్నై వ్యూహాలు బాగా లేవని.. ఎంఎస్ ధోని ఉండుంటే కచ్చితంగా వాటిని ఆమోదించే వాడు కాదని రాయుడు వెల్లడించాడు.ఓ స్పోర్ట్స్ ఛానల్‌లో అంబటి రాయుడు మాట్లాడుతూ..' ఆర్సీబీపై డెత్ ఓవర్లలో సీఎస్‌కే ప్రణాళికలు పేలవంగా ఉన్నాయి. ప్రాక్టీస్ సెషన్స్‌లోనూ కొత్త వ్యూహాలు రచించినా.. వాటిని ధోని ఆమోదించేవాడు కాదు. రౌండ్ ది వికెట్ బౌలింగ్ చేసినప్పటికీ బ్యాటర్లు సులువుగా ఎదుర్కొంటారనేది ధోనికి బాగా తెలుసు. అందుకే, డెత్ ఓవర్లలో ఎక్కువగా యార్కర్లు, లెంగ్త్‌తో కూడిన స్లో బంతులే ప్రభావం చూపిస్తాయి. వాటిపైనే చెన్నై బౌలర్లు దృష్టిపెట్టాలి. సంప్రదాయ పద్ధతిలోనే బౌలింగ్ చేయాలి' అని రాయుడు విశ్లేషించాడు.చెన్నై సూపర్ కింగ్స్ ఓటమిపై ఆ జట్టు ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టిమ్ డేవిడ్ కారణంగానే చెన్నై ఓడిందని అతడు తెలిపాడు. కేవలం 25 బంతుల్లోనే 70 పరుగులు రాబట్టిన టిమ్ డేవిడ్ ఇన్నింగ్స్ వల్లే మ్యాచ్ స్వరూపం మారిపోయిందని వెల్లడించాడు. సంజు శాంసన్ సత్తాపై తమకెలాంటి అనుమానాలు లేవని ఫ్లెమింగ్ స్పష్టం చేశాడు. సంజు సీఎస్కే ఫ్రాంచైజీలో కుదురుకోవడానికి కాస్త సమయం పడుతుందని, టీ20ల్లో ఏదైనా సరే వేగంగానే జరుగుతుందని అన్నాడు. టీ20 ప్రపంచకప్‌లో సంజు అద్భుత ప్రదర్శన చూశామని, ఈ లీగ్‌లో తప్పకుండా నాణ్యమైన ఇన్నింగ్స్‌లను చూస్తామని ఫ్లెమింగ్ వెల్లడించాడు.

## నన్ను వాళ్లు మాత్రం గుర్తించకపోవచ్చు: షమీ


ఐపీఎల్ 2026లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్‌పై 5 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన మహ్మద్ షమీ..ఎల్ఎస్‌జీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగు ఓవర్లలో కేవలం 9 పరుగులు మాత్రమే ఇచ్చి.. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ లాంటి కీలకమైె రెండు వికెట్లు సాధించాడు. దీంతో 'షమీ ఈజ్ బ్యాక్' అంటూ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారుమ్యాచ్ అనంతరం షమీమీడియాతో మాట్లాడుతూ.. క్రికెట్‌లో కొనసాగాలంటే ఆటతో సంబంధం కలిగి ఉండాల్సిందేనని స్పష్టం చేశాడు. శారీరకంగా ఫిట్‌గా ఉన్నప్పుడే నైపుణ్యాలను మెరుగు పరుచుకోగలమని పేర్కొన్నాడు. శారీరకంగా ఫిట్‌గా ఉండి నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకే దేశవాళీల్లో మ్యాచ్‌లు ఆడుతున్నానని తెలిపాడు. తానేమి యంత్రాన్ని కాదని కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజమని తెలిపాడు. గత కొన్నేళ్లుగా బాగానే ఆడుతున్నప్పటికీ వాళ్లు పట్టించుకోవడం లేదని టీమిండియా సెలక్టర్ల తీరును పరోక్షంగా విమర్శించాడు.ఎవరు గుర్తించకపోయినా తాను మాత్రం నిరంతరం శ్రమిస్తూ మరింత మెరుగయ్యేందుకు ప్రయత్నిస్తూనే ఉంటానని వెల్లడించాడు. అభిషేక్, హెడ్ వంటి వాళ్లకు ఏమాత్రం అవకాశం ఇచ్చినా మ్యాచ్‌ను లాగేసుకుంటారని, వారిపైనే ఫోకస్ పెట్టి విజయం సాధించామని అన్నాడు. టీమిండియా తరఫున ఆడుతున్న సమయం నుంచే బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్‌తో చక్కటి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నాడు.కాగా 2025 మార్చి నుంచి షమీ భారత జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే.



దేశీ క్రికెట్‌లో సత్తా చాటినా సెలక్టర్లు మాత్రం అతడిని పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఐపీఎల్-2026లో తనను తాను నిరూపించుకుని మరోసారి ఆటతోనే సెలక్టర్లకు సందేశం పంపాలని షమీ కసితో ఉన్నాడు. గత సీజన్ లో ఎస్ఆర్ హెచ్ తరఫున ఆడిన షమీ... ఈసారి లక్నో తరఫున బరిలోకి దిగాడు. ఈ సీజన్ లో తొలుత ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో ఒక వికెట్ సాధించగా.. ఇక తాజాగా సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో అత్యంత పొదుపుగా బౌలింగ్ వేశాడు. ఈ మ్యాచ్‌లో షమీ 18 డాట్ బాల్స్ వేసిన షమీ 'డాట్ బాల్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డును అందుకున్నాడు.

## స్టేడియంలో యువతి చేసిన రచ్చ.. ఫిదా అయిన ఆర్సీబీ ఫ్యాన్స్!

ఐపీఎల్2025లో భాగంగా ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరిగింది. ఈ పోరు కేవలం మైదానంలోనే కాదు.. గ్యాలరీలో కూడా హోరాహోరీగా సాగింది. ఈ మ్యాచ్‌లో 43 పరుగు తేడాతో ఆర్సీబీ అద్భుత విజయం సాధించడంతో బెంగళూరు అభిమానులు సంబరాలు ఆకాశాన్ని తాకాయి. ఈ క్రమంలో ఓ ఆర్సీబీ మహిళా అభిమాని చేసిన సందడి ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఆ యువతి చేసిన పనికి తోటి ఆర్సీబీ అభిమానులుఫిదా అవుతున్నారు.ఆ వీడియోలో సదరు యువతి ఆర్సీబీ జట్టు గెలిచిన ఆనందంలో పక్కనే ఉన్న సీఎస్కే అభిమాని వైపు తిరిగి బిగ్గరగా అరుస్తూ సెలబ్రేట్ చేసుకోవడం కనిపించింది. ఆ అమ్మాయి అరుస్తున్న సమయంలో పక్కనే ఉన్న చెన్నై అభిమాని(అూఐ ఈజీని) మాత్రం చాలా నిశ్శబ్ధంగా, కాస్త నిరాశగా కనిపించాడు. ఇప్పుడు మీ టైమ్ నడుస్తోంది అన్నట్లు ఆ యువతి చేసిన సందడికి సీఎస్కే అభిమాని మౌనంగా ఉన్నాడు. అయితే వీరిద్దరు వేరు వేరు జట్లకు అభిమానులు అయినప్పటికీ స్నేహితులని సమాచారం. ఈ వీడియో చూసిన క్రికెట్ అభిమానులు భిన్నంగా స్పందిస్తున్నారు. ఆర్సీబీ అభిమానుల



ఎమోషన్ అంటే ఇలాగే ఉంటుందని కొందరు అంటుంటే.. గెలుపోటములు సహజం, కానీ ఆ అమ్మాయి ఎనర్జీ మాత్రం వేరే లెవల్ అని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ ఓడిన రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు మొదటి బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఐపీఎల్ చరిత్రలోనే చెన్నైపై ఆర్సీబీ చేసిన అత్యధిక స్కోర్ ఇదే కావడం గమన్హారం. ఇక భారీ లక్ష్య ఛేదనలో బ్యాటింగ్ దిగిన చెన్నై సూపర్ కింగ్స్ 207 పరుగులకే ఆలౌటైంది. ఫలితంగా 43 పరుగుల తేడాతో ఆర్సీబీ విజయం సాధించింది. దీంతో ఆర్సీబీ వరుసగా రెండు మ్యాచుల్లో విజయం సాధించగా.. చెన్నై వరుసగా మూడు ఓటములు చవి చూసింది.

## టిమ్ డేవిడ్ క్లీన్ బౌల్డ్.... కానీ నోబాల్ తోనే ఓటమి: రుతురాజ్

హైదరాబాద్: ఐపిఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు వరసగా మూడో మ్యాచ్‌లలో ఓటమిని చవిచూసింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు విఫలం కావడంతో ఆ జట్టు పరాజయాలపాలైంది. ఆర్‌సిబితో జరిగిన మ్యాచ్‌లో సిఎస్‌కె జ్టటు 43 పరుగుల తేడాతో ఓడిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్‌సిబి జట్టు 251 పరుగుల లక్ష్యాన్ని సిఎస్‌కె ముందు ఉంచింది. సంజు శామ్సన్‌పై అధిక అంచనాలను పెట్టుకున్నప్పటికి అతడు వమ్ము చేశాడు. హ్యాట్రిక్ ఓటమికి తానే బాధ్యుడినని కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు. ఆర్‌సిబితో జరిగిన మ్యాచ్‌లో తాను ఆడి ఉంటే భిన్నంగా ఉండేదని వివరించాడు. ఆర్‌సిబి బ్యాటింగ్ చేస్తున్నప్పుడు 14 ఓవర్ వరకు మ్యాచ్ చెన్నై చేతిలోనే ఉందని, టిమ్ డేవిడ్‌ను అన్షుల్ కాంబోజ్ క్లీన్ బౌల్డ్ చేసినప్పటి, అది నో బాల్ కావడంతో అక్కడి నుంచి మ్యాచ్ స్వరూపం మారిపోయిందన్నారు. లక్ష్య చేదనలో కూడా మూడు వికెట్లు త్వరగా పడిపోవడంతో పీకల్లోతు కష్టాల్లో జట్టు పడిందని, సర్ఫరాజ్ ఖాన్, ప్రశాంత్ వీర్, ఓవర్టన్ మంచి ఆటతీరు ప్రదర్శించారని కొనియాడారు. శివమ్ దూబే దురదృష్టవశాత్తూ పెవిలియన్‌కు చేరాడని పేర్కొన్నారు. మూడు ఓటములకు తానే బాధ్యత వహిస్తున్నానని రుతురాజ్ స్పష్టం చేశాడు.




## ధోనికి ఫిట్‌నెస్ టెస్ట్.. ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో బరిలోకి దిగనున్న తలా!

ఎన్నో ఆశలతో 2026 ఐపీఎల్ సీజన్‌ను ప్రారంభించిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. అటు బ్యాట్‌తోనూ, ఇటు బంతితోనూ ప్లేయర్లు విఫలమైన వేళ.. సీఎస్కే వరుసగా మూడో పరాజయాన్ని చవి చూసింది. ప్రస్తుతం అందరి దృష్టి.. క్రికెట్ దిగ్గజం, సీఎస్కే స్టార్ ప్లేయర్ ఎంఎస్ ధోనిపైనే ఉంది. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు ధోని రెండు వారాలు ఆటకు దూరమంటూ సీఎస్కే మేనేజ్‌మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తలా రాక కోసం అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ సీఎస్కే ఓడిపోవడంతో.. ఇక ధోని జట్టులో చేరి తీరాల్సిందేనని అభిమానులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ క్రేజీ న్యూస్ వైరల్ అవుతోంది. రాబోయే రెండు రోజుల్లో ధోనికి ఫిట్‌నెస్ టెస్ట్ జరగబోతోందని సీఎస్కే క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. అది పూర్తి చేసుకుని ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగనున్నట్లు సమాచారం. కాగా ఏప్రిల్ 11(శనివారం)న సీఎస్కే.. చెన్నైలోని చెపాక్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. హోం గ్రౌండ్‌లో ధోని బరిలోకి దిగి జట్టుకు విజయాన్ని అందించాలని అభిమానులు కోరుకుంటున్నారు.ధోనితో పాటు సీఎస్కే హిట్టర్ డేవాల్డ్ బ్రెవిస్ కూడా ఆటకు దూరమైన సంగతి తెలిసిందే. అయితే బ్రెవిస్ కూడా ఢిల్లీతో మ్యాచ్‌లో ఆడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మాట్లాడాడు. 'బ్రెవిస్ తదుపరి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నా. మాకు ఇంకా ఐదు రోజుల సమయం ఉంది. మేం అనుకున్న విధంగానే మా ప్రణాళికలను అమలు చేస్తాం' అని ఫ్లెమింగ్ వెల్లడించాడు.




## అందుకే ఐపీఎల్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించా.. అశ్విన్ సంచలన వ్యాఖ్యలు




ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు పేలవ ప్రదర్శన కనబరుస్తున్న సంగతి తెలిసిందే. ఆడిన మూడు మ్యాచుల్లోనూ ఓటమి చవి చూసి తీవ్ర విమర్శల పాలైంది. ఈ నేపథ్యంలో తన ఐపీఎల్ రిటైర్‌మెంట్‌పై టీమిండియా దిగ్గజం, సీఎస్కే మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. గతేడాది అశ్విన్ అనూహ్యంగా ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఆ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను, తన మనసులోని ఆవేదనను తాజాగా అశ్విన్ పంచుకున్నాడు.'ఐపీఎల్ 2025.. నా కెరీర్‌లో అత్యంత నిరాశాజనకమైన సీజన్ అది. నిజం చెప్పాలంటే నేను ఇంకా ఆడగలిగే స్థితిలోనే ఉన్నాను. కానీ మానసికంగా పూర్తిగా అలసిపోయాను. అలాంటి పరిస్థితుల్లో కొనసాగడం చాలా కష్టం అనిపించింది. గత ఐపీఎల్ సీజన్ గురించి ఆలోచిస్తేనే చాలా బాధగా ఉంటుంది. అందుకే అక్కడ జరిగిన విషయాల గురించి నేను మాట్లాడాలనుకోవడం లేదు. నా రిటైర్‌మెంట్ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం అయితే కాదు. ఇందులో జట్టు ప్రయోజనాలు కూడా ఉన్నాయి. నేను జట్టులో కొనసాగితే నన్ను రిటైన్ చేయాలా? రిలీజ్ చేయాలా? అన్న సందిగ్ధం మేనేజ్‌మెంట్‌కు ఉంటుంది. నేను తప్పుకుంటే వారికి ఆ సమస్య ఉండదు. అందులోనూ ఫ్రాంచైజీకి సుమారు రూ.10కోట్లు సేవ్ అవుతాయి' అని అశ్విన్ వెల్లడించాడు.ప్రస్తుతం సీఎస్కే యువ ఆటగాళ్లతోనే ఆడుతోంది. ఈ విషయంపై కూడా అశ్విన్ మాట్లాడాడు. 'యువ ప్లేయర్లకు సరైన శిక్షణ, ప్రాక్టీస్, పోటీ వాతావరణం కల్పించకుండా మంచి ఫలితాలు ఆశించడం పద్ధతి కాదు. బౌలర్లను వారి బలాలకు విరుద్ధంగా ఉపయోగిస్తే జట్టుకే నష్టం. జెమీ ఓవర్టన్ వంటి బౌలర్లకు అలవాటే లేని యార్కర్లు వేయమని ఒత్తిడి చేయడం సరైన వ్యూహం కాదు. వారికున్న బలాలను కనుగొని.. తగ్గట్టుగా శిక్షణ ఇస్తే జట్టుకు విజయాలు దక్కే అవకాశాలు ఉంటాయి' అని అశ్విన్ వివరించాడు.

## ఇషాన్ కిషన్ చేసిన మిస్టేక్.. గర్ల్‌ఫ్రెండ్ అదితి షాకింగ్ లుక్!

ఐపీఎల్ 19వ సీజన్‌లో భాగంగా ఆదివారం సన్ రైజర్స్ హైదరాబాద్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఈ మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ ఓ కీలకమైన రనౌట్ అవకాశాన్ని చేజార్చాడు. దీంతో గ్యాలరీలో ఉన్న అతడి గర్ల్‌ఫ్రెండ్ అదితి హుండియా ముఖం నిరుత్సాహంగా పెట్టింది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోన్నాయి. ఇక పూర్తి కథనంలోకి వెళ్తే...హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఈ పోరులో లఖ్‌నవూ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్ కేవలం 156 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం 5 వికెట్లు కోల్పోయిన ఎల్ఎస్‌జీ 19.5 ఓవర్లో లక్ష్యాన్ని చేధించింది. కెప్టెన్ రిషబ్ పంత్ చివరి వరకు నిలబడి.. ఎస్ఎస్‌జీ విజయంలో కీలక పాత్రపోషించాడు. లఖ్‌నవూ ఇన్నింగ్స్16వ ఓవర్లో జయదేవ్ ఉనద్కత్ వేసిన బంతికి పంత్‌ను రనౌట్ చేసే మంచి అవకాశం ఇషాన్ కిషన్‌కు లభించింది.ఆ సమయంలో మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరిత దశలో ఉంది. పంత్ వికెట్ పడి ఉంటే మ్యాచ్ ఫలితం హైదరాబాద్ వైపు మొగ్గేది. కానీ ఇషాన్ కిషన్ రనౌట్ మిస్ చేయడంతో స్టేడియంలో ఉన్న అదితి హుండియా తీవ్ర నిరుత్సాహానికి గురైంది. ఆమె ముఖం మాడిపోవడమే కాకుండా చాలా దిగులుగా కనిపించిన దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. తన బాయ్ ఫ్రెండ్ జట్టు ఓడిపోవడం, అందులోనూ ఇషాన్ కిషన్ చేసిన పొరపాటు పట్ల అదితి రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుంది.






# 10న విడుదలవుతున్న డెకాయిట్

## ట్రైలర్ విడుదల చేసిన చిత్ర బృందం





అడివి శేష్ హీరోగా రానున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' షానీల్ డియో దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక ప్రత్యేక బ్రాండ్‌ను




క్రియేట్ చేసుకున్న హీరో అడివి శేష్. తన తదుపరి చిత్రం 'డెకాయిట్' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మృణాల్ ఠాకూర్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుంది. ఈ చిత్రంతో ఏప్రిల్ 10న విడుదల కాబోతున్న తరుణంలో శేష్ వరుస ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలోని కీలక విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తన సినిమాలను నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు ఇప్పటివరకు నష్టాలు రాలేదని ఆయన గర్వంగా చెప్పుకొచ్చారు. 'ఇప్పటివరకు నాతో పని చేసిన ప్రొడ్యూసర్స్ అందరూ లాభాలు గడించారు. వాళ్ళు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని నేను నమ్ముతున్నాను' అని శేష్ పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా, స్క్రిప్ట్ విషయంలో కూడా శేష్ తీసుకునే జాగ్రత్తలే ఆయన సినిమాల మినిమమ్ గ్యారెంటీ సక్సెస్‌కు కారణమని ఇండస్ట్రీ టాక్. అలాగే తన కెరీర్‌లో మర్చిపోలేని సినిమా గురించి ప్రస్తావిస్తూ.. గూఢచారి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా ఇచ్చిన సక్సెస్ వల్లే ఈరోజు నేను ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేయగలుగుతున్నాను' అని ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపు శేష్‌ను కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ఒక నమ్మకమైన హీరోగా నిలబెట్టిందన్నారు.

# ఎల్లమ్మ కథకు దేవిశ్రీ అయితేనే సరిపోతాడు

## క్లారిటీ ఇచ్చిన దర్శకుడు బలగం వేణు




'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించ బోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు. సినిమాలో తీసుకునే ప్రతి నిర్ణయం కథకు అనుగుణంగానే ఉంటుంది. 'ఎల్లమ్మ' కథకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉన్న వ్యక్తి కావాలి. మొదట వేరే నటులను అనుకున్నా? కథ మారుతూ ఉండటంతో దేవి శ్రీ ప్రసాద్ అయితేనే సరిపోతారని భావించాం అని తెలిపారు. కథలోని సహజత్వం , భావోద్వేగాలను ప్రేక్షకులకు బలంగా చేరవేయడానికి దేవి సరైన ఎంపికగా కనిపించారని ఆయన వివరించారు. బలగంతో గ్రామీణ భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన వేణు? 'ఎల్లమ్మ'లో కూడా అదే మట్టి వాసనను తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కూడా ఎమోషనల్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం. సంగీత దర్శకుడిగా ఎనలేని క్రేజ్ సంపాదించిన దేవి శ్రీ ప్రసాద్‌ని నటుడిగా ఎలా చూపిస్తారు? ఆయన పాత్రలో ఎంతవరకు ఒదిగిపోతారు? అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. టాలీవుడ్‌లో కొత్త ప్రయోగాలలు ఎప్పుడు అందరిలో ఆసక్తిని కలిగిస్తుంటాయనే విషయం మనకు తెలిసిందే. ఈ క్రమంలో వేణు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# రామాయణం మూలకథ నుంచి తప్పకోరాదు

## ఆదిపురుష్ తప్పులను రామాయణలో చేయరాదు

ప్రభాస్ కథానాయకుడిగా ఓం రౌత్ దర్శకత్వంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాపై దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా డైరెక్టర్ నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న 'రామాయణ్' టీజర్‌పై దివంగత నటుడు దారసింగ్ కుమారుడు, నటుడు విందు దారసింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల విడుదలైన రామ టీజర్‌లో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి లుక్ అద్భుతంగా ఉందంటూ ప్రశంసించిన ఆయన.. అదే




సమయంలో మేకర్స్‌కు ఒక సున్నితమైన హెచ్చరిక చేశాడు. రామాయణం వంటి పవిత్ర కావ్యాన్ని తెరకెక్కించేటప్పుడు మూల కథ నుంచి ఏమాత్రం పక్కకు జరిగినా ప్రేక్షకులు అస్సలు ఒప్పుకోరని ఆయన స్పష్టం చేశాడు. దిగ్గజ నటుడు దారసింగ్.. గతంలో రామానంద్ సాగర్ రూపొందించిన 'రామాయణ్' సీరియల్‌లో హనుమంతుడి పాత్రలో జీవించి ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. ఆ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న విందు మాట్లాడుతూ.. రామాయణ్ టీజర్ చాలా అద్భుతంగా, ఎంతో అందంగా ఉంది. అయితే ఇక్కడ ఒక కఠినమైన నియమం ఉంది. రామానంద్ సాగర్ గారు తీసిన రామాయణం మనందరి హృదయాల్లో, మనస్సుల్లో బలంగా నాటుకుపోయింది. అది ఒక చరిత్ర, ఎప్పటికీ నెంబర్ వన్. ఇప్పుడు రాబోతున్న సినిమా ఆ స్థాయిని అందుకుంటే మాత్రం రికార్డులను తిరగరాసే సూపర్ హిట్ అవుతుంది. కానీ కథలో అనవసర మార్పులు చేసినా, పాత్రలను మరీ భయంకరంగా అసురుల తరహాలో చూపించినా జనాలు అస్సలు అంగీకరించరు అని విందు పేర్కొన్నాడు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు నేను చూసిన దాన్ని బట్టి తివారీ గారి 'రామాయణ్' చాలా మెరుగ్గా కనిపిస్తోంది.



# రాముడు, పరశురాముడు..రెండూ రణ్‌బీర్ కపూరే

## ద్విపాత్రాభినయం గురించి వెల్లడించిన రణ్‌బీర్

ప్రకటించిన నాటినుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 'రామాయణ'. ఇటీవల దీని టీజర్ విడుదలై మంచి స్పందనను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి రణ్‌బీర్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేసినట్లు తెలిపారు. ఇందులో రణ్‌బీర్ శ్రీరాముడితో పాటు పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. 'శ్రీ మహావిష్ణువు ఆరో అవతారం పరశురాముడు. ఈ సినిమాలో శ్రీరాముడితో పాటు పరశురాముడిగా కూడా నటించే అవకాశం రావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి సినిమాల్లో నటించేటప్పుడు బాడీ లాంగ్వేజ్ మాత్రమే కాదు.. ఆ పాత్రల వెనక ఉన్న ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను లోతుగా అర్థం చేసుకోవడం ముఖ్యం. 'రామాయణ' చిత్రీకరణకు ముందు ఏడాది పాటు ఆ పాత్రల గురించి బాగా తెలుసుకున్నానని రణ్‌బీర్ తెలిపారు.ప్రస్తుతం 'రామాయణ'కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమా కోసం ఓ ఓటీటీ సంస్థ భారీ డీల్‌కు ముందుకు వచ్చిందిట. కానీ, నిర్మాత నమిత్ మల్హోత్రా ఆ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. రెండు భాగాలకు కలిపి ఓటీటీ సంస్థ రూ.1000 కోట్లకు అడగ్గా.. ఆయన దాన్ని తిరస్కరించారట. ఈ డిజిటల్ హక్కుల విషయంలో ఆయన 'ధురంధర్' చిత్రబృందం వ్యూహాన్ని అనుసరించాలని చూస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మొదట పార్ట్ వన్‌తో డీల్



కుదుర్చుకుని అది విడుదలైన తర్వాత దానికి వచ్చిన స్పందనను బట్టి రెండో భాగానికి ఒప్పందం కుదుర్చుకోవచ్చని నిర్మాత భావిస్తున్నట్లు సమాచారం. రూ.4000 కోట్లతో అత్యంత భారీ బ్జడెట్‌తో ఈ ప్రాజెక్ట్ రానుంది. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం దాని వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి. తాజాగా ఈ సినిమా రన్‌టైంకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఇటీవల అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో హాలీవుడ్ మీడియాతో 'రామాయణ్' సినిమా విశేషాలను పంచుకుంటున్న సమయంలో.. రణ్‌బీర్ కపూర్ అతడికి తెలియకుండానే సినిమా రన్‌టైం గురించి నోరు జారడు. ఈ సినిమా గురించి రణ్‌బీర్ మాట్లాడుతూ.. దాదాపు 6 గంటల ఎపిక్ విజువల్స్‌తో ఈ సినిమా రాబోతుంది.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**